మక్కరాజిపేట టీచర్‌కు గ్రూప్ 2లో 259 ర్యాంక్

చేగుంట, మార్చి 11: మండలంలోని మక్కరాజిపేటలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న అల్లి విజయ్‌సేనారెడ్డి గ్రూప్ 2 ఫలితాల్లో 259 రాష్ట్ర ర్యాంక్ సాధించారు. మంగళవారం వెలువడిన ఫలితాల్లో అల్లి విజయ్‌సేనారెడ్డి ర్యాంక్ సాధించిన విషయం తెలుసుకున్న తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్, మండల అధ్యక్షుడు రావుల వెంకటేశ్, లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్లు వంటరి రాంరెడ్డి, చౌడం నర్సింహులు, సీనియర్ జర్నలిస్టు ఆది సురేందర్ సన్మానించి, అభినందనలు తెలిపారు.

స్వశక్తితోనే మహిళా సాధికారిత

మాట్లాడుతున్న టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నరేందర్

మెదక్, మార్చి 11 (నమస్తే తెలంగాణ): సమానత్వం ఇంటి నుంచే మొదలవ్వాలని, మహిళలు స్వశక్తితోనే సాధికారత సాధించగలరని, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ అన్నారు. మంగళవారం టీఎన్జీవో భవన్‌లో మహిళా విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలన్నారు. ఆర్థికాభివృద్ధిలో మహిళలు క్రియాశీలక పాత్ర పోషిస్తే కుటుంబ అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. అనంతరం జిల్లా కార్యదర్శి మినికి రాజ్ కుమార్‌తో కలిసి అధికారులు, ఉద్యోగులను ఘనంగా సత్కరించారు.

రోడ్డు వెడల్పు చేయాలని సంతకాల సేకరణ

వెల్దుర్తి, మార్చి 11: మెదక్ నుంచి వెల్దుర్తి వరకు రోడ్డును రెండు వరుసల రోడ్డుగా చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నర్సమ్మ, జిల్లా కార్యవర్గ సభ్యుడు మల్లేశం డిమాండ్ చేశారు. మంగళవారం వెల్దుర్తితో పాటు మెదక్‌కు వెళ్లే దారిలో ఉన్న గ్రామాల ప్రజల నుంచి రోడ్డు వెడల్పు వినతిపత్రంపై సీపీఎం నాయకులు సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెదక్ నుంచి పిల్లికొట్టాల, శెట్‌పల్లి, బండపోసాన్‌పల్లి, రామాయిపల్లి, ఉప్పులింగాపూర్ గ్రామాల మీదుగా వెల్దుర్తి వరకు ప్రస్తుతం ఉన్న రోడ్డు గుంతలమయంగా, ప్రయాణం చేయడానికి వీలుగా లేదన్నారు. ఆటోల్లో ప్రయాణికులు ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారని, రోడ్డు వెడల్పు చేసి బస్సులు నడపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గౌరీ, నాయకులు పాల్గొన్నారు.

ఎల్ ఆర్ఎస్ ఫీజు చెల్లించి రెగ్యులర్ చేసుకోవాలి

మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావు

నర్సాపూర్, మార్చి 11: లే అవుట్ ఓనర్లు చట్టప్రకారం 25 శాతం ఫీజు మినహాయింపు ద్వారా ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించి ప్లాట్లను రెగ్యులర్ చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావు సూచించారు. మంగళవారం నర్సాపూర్‌లోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రామకృష్ణారావు, సబ్ రిజిష్టర్ అన్సారీ ఆధ్వర్యంలో డాక్యుమెంట్ రైటర్లు, టౌన్ ప్లానింగ్ అధికారి ప్రభాకర్, ఎల్టీపీలు, లే అవుట్ ఓనర్లతో సమావేశం నిర్వహించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ఫీజు వసూలుకు సూచనలు, సలహాలు ఇచ్చారు.

పారిశుధ్య కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

చేగుంటలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా నాయకురాలు బాలమణి

చేగుంట, మార్చి 11: ఆర్థిక ఇబ్బందులతో చెట్లతిమ్మాయిపల్లిలో ఆత్మహత్య చేసుకున్న పారిశుధ్య కార్మికుడు చేపూరి ప్రశాంత్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకురాలు బాలమణి డిమాండ్ చేశారు. చేగుంటలో వారు మాట్లాడుతూ కొన్ని రోజులుగా పారిశుధ్య కార్మికుడు ప్రశాంత్ పంచాయతీ ట్రాక్టర్ నడుపుతున్నాడు. చాలీచాలని జీతంతో భార్యాపిల్లలతో జీవిస్తున్నాడు. ప్రభుత్వం నుంచి వచ్చే జీతం సరిపోక అప్పులు చేసి వాటిని తీర్చలేక మనస్తాపం చెంది, ఆత్మహత్య చేసుకున్నాడు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పంచాయతీ కార్మికులను రెగ్యులర్ చేస్తామని, ఎన్నికల్లో హామీ ఇచ్చి మోసం చేసిందని విమర్శించారు. వారికి ఉద్యోగ భద్రత లేదని వాపోయారు. ప్రభుత్వం స్పందించి మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

డంపింగ్‌యార్డుతో పంటలకు పెద్ద నష్టం

సంఘీభావం తెలుపుతున్న రైతు రక్షణ సమితి ముఖ్య సలహాదారుడు చంద్రశేఖర్

నర్సాపూర్, మార్చి 11: ప్యారానగర్‌లో డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తే భూములు కలుషితమై పంటలు పెద్ద మొత్తంలో నష్టపోతాయని తెలంగాణ రైతు రక్షణ సమితి ముఖ్య సలహాదారుడు చంద్రశేఖర్ తెలిపారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం ప్యారానగర్‌లో ఏర్పాటు చేయనున్న డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా నర్సాపూర్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్ష 23వ రోజుకు చేరుకున్నది. ఈ దీక్షలో నర్సాపూర్‌కు చెందిన మార్వాడీ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రూ.80 లక్షలతో సీసీ రోడ్డు పనులు

పెద్దశంకరంపేట, మార్చి 11: పెద్దశంకరంపేటలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి గాంధీ చౌరస్తా మీదుగా రూ.80 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆర్‌అండ్‌బీ డీఈ వెంకటేశ్వర్లు మంగళవారం పరిశీలించారు. ఈ రోడ్డు పనులు నాణ్యతగా చేయాలని, వీలైనంత త్వరలో పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరారు.

పల్లె ఖజానా ఖాళీ!

- పంచాయతీల్లో చిల్లి గవ్వ లేక ఇబ్బందులు
- ఆగిన అభివృద్ధి.. పెరుగుతున్న అప్పులు
- పంచాయతీ కార్యదర్శుల నెత్తిన బాధ్యతల భారం
- చుట్టపు చూపుగా ప్రత్యేకాధికారులు

చెత్తను తీసుకెళ్తున్న పంచాయతీ ట్రాక్టర్

మురుగు కాల్వలు తీస్తున్న సిబ్బంది జీపీ ఆఫీస్

తడి, పొడి చెత్త యార్డులు

దామరచెర్వులో పల్లె ప్రకృతి వనం

రామాయంపేట రూరల్, మార్చి 11: రామాయంపేట మండలంలో గ్రామ పంచాయతీల పరిస్థితి దీనావస్థలో ఉంది. చేపట్టిన పనులకు బిల్లులు రాక, చేయాల్సిన పనులు ఆగిపోయి, దిక్కుతోచని స్థితిలో పంచాయతీ కార్యదర్శులు. లక్షల రూపాయలు పెండింగ్‌లో ఉండడంలో చేయాల్సిన పనులు నిలిచిపోయాయి. కనీసం పారిశుధ్య సిబ్బందికి జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నాయి. పంచాయితీల్లో చిల్లి గవ్వ లేదు. ఈ విషయంలో ఆందోళనలు చేయడంతో గతేడాది డిసెంబర్ వరకు ప్రభుత్వం జీతాలు మంజూరుచేసింది. సర్పంచ్‌ల కాలం ముగిసి ప్రత్యేక అధికారుల పాలనలోకి వెళ్లిన గ్రామ పంచాయతీలకు ఇప్పుడు ఈ ఆర్థిక భారం పెను సవాల్‌గా మారింది. పాలకవర్గాలు లేని పంచాయతీల్లో బాధ్యతల భారం కార్యదర్శులకు తలనొప్పిగా మారింది. ప్రస్తుతం పంచాయతీ పాలనలో తామే కీలకం కావడంతో కార్యదర్శులు అడకత్తెరలో పోక చెక్కలా నలిగిపోతున్నారు.

నిధుల్లేక ఆగిపోయిన అభివృద్ధి పనులు

పంచాయతీ ఆధ్వర్యంలో నడుస్తున్న చెత్త సేకరణ, వాటర్ ట్యాంకర్లకు అవసరమైన డీజిల్, పల్లె ప్రకృతి వనం పనులు, పారిశుధ్య పనుల నిర్వహణ, చెత్త సేకరణ, డంపింగ్‌యార్డులు, శ్మశాన వాటిక నిర్వహణ తదితర పనులు నిరంతరం కొనసాగించాల్సిందే. వీటి బాధ్యత పంచాయతీ కార్యదర్శులదే. ఇదంతా నిర్వహణకు నిధుల కొరత ఉంది. దీంతో తమకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని, పాలకవర్గం ఉంటే ఈ ఇబ్బందులు ఉండవని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి పని ఆర్థికపరమైన అంశమే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సకాలంలో నిధులు అందక పంచాయతీల్లో ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గతేడాది ఫిబ్రవరి నుంచి పంచాయతీ పాలక వర్గం పదవీ కాలం ముగిసింది. అప్పటి నుంచి పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతున్నది. ఇతర శాఖల్లో కీలకంగా ఉన్న గెజిటెడ్ అధికారులకు ప్రత్యేక అధికారులుగా నియమించారు. అదనపు బాధ్యతలు అప్పగించడంతో వారు తీరిక దొరికినప్పుడే గ్రామాలకు వెళ్తున్నారు. దీంతో గ్రామాల అభివృద్ధిపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. ఇప్పటికైనా ప్రభుత్వాలు పట్టించుకుని పంచాయతీలకు నిధులు కేటాయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి: కలెక్టర్

దివ్యాంగులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, మార్చి 11 (నమస్తే తెలంగాణ): దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో దివ్యాంగుల ప్రజావాణి కార్యక్రమాన్ని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. దివ్యాంగుల వద్దకు కలెక్టర్ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. దివ్యాంగుల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రజావాణికి విశేష స్పందన లభిస్తున్నదన్నారు. వారి ద్వారా స్వీకరించిన దరఖాస్తులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు చేపడతామన్నారు. దివ్యాంగుల వివిధ సమస్యలపై 23 దరఖాస్తులు స్వీకరించామని, వాటిని త్వరగా సంబంధిత అధికారుల ద్వారా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి శ్రీరామ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

యువ మహోత్సవంలో డిగ్రీ విద్యార్థుల ప్రతిభ

మెదక్‌లో సర్టిఫికెట్లు అందుకుంటున్న విద్యార్థులు

నర్సాపూర్, మార్చి 11: మండలకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు యువ మహోత్సవంలో ప్రతిభ చాటారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో వికసిత్ భారత్-2047 ఉద్దేశంతో యువ మహోత్సవ్-25 నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకుడు డాక్టర్ సురేశ్‌కుమార్ మాట్లాడుతూ 18 నుంచి 25 ఏండ్లు గల విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు, పెయింటింగ్, ఫొటోగ్రఫీ, పోయెట్రీ పోటీలు నిర్వహించారన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎం.వైష్ణవి బృందం ప్రదర్శించిన నర్సాపూర్ ఫారెస్ట్ పార్క్‌లో సీతాకోక చిలుకల సంరక్షణ విధానంపై నిర్వహించిన ప్రాజెక్టు ప్రథమ బహుమతి సాధించి, రూ.7 వేల బహుమతి సాధించినట్లు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమంలో జానపద నృత్యంలో సంపూర్ణ బృందం తృతీయ బహుమతి సాధించారన్నారు. కవిత రచన పోటీల్లో మెహెక్ తృతీయ బహుమతి సాధించారు, విద్యార్థులను అభినందించారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి

వినతి పత్రం అందజేస్తున్న తండావాసులు

కౌడిపల్లి, మార్చి 11: ప్రభుత్వ భూమి కబ్జాకు ప్రయత్నిస్తున్న రియల్ వ్యాపారుల నుంచి కాపాడాలని తునికి దేవులనాయక్ తండావాసులు మంగళవారం తహసీల్దార్ ఆంజనేయులుకు వినతి పత్రం అందజేశారు. అనంతరం తండావాసులు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలోని సర్వే నెంబర్ 245లో రెండెకరాల భూమి ఉందని, అది మెదక్-హైదరాబాద్ 765డీ జాతీయ రహదారి, రైతువేదిక పక్కన ఉన్నదన్నారు. కొన్నేండ్లు ఒక వ్యక్తి కబ్జాలో ఉండి ఆ భూమిలో రూం కట్టుకుని ఉంటున్నాడని తెలిపారు. ప్రభుత్వ సర్వే ప్రకారం ఈ భూమి అతడిది కాదని తేలిందన్నారు. కాగా అతని రూంతో పాటు భూమిని ప్రభుత్వం స్వాధీనంలోకి తీసుకుని ఆ రూం గోడలపై ఇది ప్రభుత్వ భూమి అని హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ స్థలంలో గతంలో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం కోసం కొబ్బరి కాయ కొట్టి భూమి పూజ కూడా చేసినట్లు వారు గుర్తు చేశారు. కాని ఇక్కడ ఎలాంటి నిర్మాణాలు జరుగక పోగా, అలాగే ఉందన్నారు. కొందరు రియల్ వ్యాపారులు కబ్జాకు ప్రయత్నించగా, మూడు నెలల క్రితం తహసీల్దార్‌కు మొరపెట్టుకున్నా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇదే అదునుగా భావించిన రియల్ వ్యాపారులు 30 రోజుల క్రితం రూంను ధ్వంసం చేశారన్నారు. ఈ భూమిలో రాత్రికి రాత్రే కడీలు పాతి చదును చేస్తూ, కబ్జాకు ప్రయత్నిస్తున్నారని వారు తెలిపారు. ఈ భూమిని కబ్జా నుంచి కాపాడాలని తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో దేవులా నాయక్ తండా వాసులు కొర్ర శ్రీను, కె.ధన్సింగ్, కె.రవీందర్, రమేశ్, వీ.సురేశ్, ఎస్‌కె ఇస్మాయిల్, కాట్రోత్ జితేందర్, కే.రమేశ్ తదితరులు ఉన్నారు.

వనదుర్గామాత సన్నిధిలో ఎమ్మెల్సీ

పాపన్నపేట, మార్చి 11: ఏడుపాయల వనదుర్గామాతను ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ ఈవో చంద్రశేఖర్ అర్చకులు స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

బోనం ఎత్తిన మాజీ ఎమ్మెల్యే

పాపన్నపేట, మార్చి 11: పాపన్నపేట మండలంలోని ముద్దాపూర్ గ్రామంలో ముత్యాల పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలతో కలిసి పోచమ్మ బోనం ఎత్తుకొని, అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ మాజీ చైర్మన్ వెంకట్రాం రెడ్డి, మాజీ సర్పంచ్ గురుమూర్తిగౌడ్, దానయ్య, లింగారెడ్డి, బద్రి, మల్లేశం, శ్రీనాథ్‌రావు, వడ్ల కుబేర్, నాయకులు ఉన్నారు.

దొంతిలో బీటీ రోడ్డు పూర్తి చేయడంపై హర్షం

ఎమ్మెల్యే సునీతారెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన బీఆర్ఎస్ నాయకులు

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్న దొంతి గ్రామకమిటీ సభ్యులు

శివ్వంపేట, మార్చి 11: మండలంలోని దొంతి గ్రామంలో బీఆర్ఎస్ హయాంలో మంజూరు చేసిన బీటీ రోడ్డు పనులు పూర్తి కావడంతో బీఆర్ఎస్ గ్రామ కమిటీ నాయకులు హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు చిగుళ్లపల్లి శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ ఎన్నో ఏండ్లుగా ప్రధాన రహదారి నుంచి దొంతి గ్రామం వరకు రోడ్డు అధ్వానంగా ఉండడంతో బీఆర్ఎస్ హయాంలో నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ రోడ్డు పెండింగ్‌లో ఉండడంతో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని పనులు పూర్తి చేయించినందుకు గ్రామస్తుల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మహమ్మద్ లాయక్, ట్రెజరర్ నరేందర్‌గుప్తా, వంజరి రాహుల్, కొత్త శ్రీనివాస్, బొడ్డు సుధాకర్, బుద్ధుల భిక్షపతి, గుర్రం శ్రీకాంత్‌రెడ్డి, గొత్రాల లక్ష్మీనర్సయ్య, వరిగె కాంతం, పోతుకాని నరేశ్, చాకలి దశరథ, జోగిని చంద్రం, మంగలి బాలు, బుడిగె ఆంజనేయులుగౌడ్, కటికె శ్యాసుందర్ తదితరులు ఉన్నారు.

గ్రూప్-2లో మనోహర్‌రావుకు 3 ర్యాంక్

మనోహర్ రావును అభినందిస్తున్న భార్య, స్నేహితులు, గ్రామస్తులు

- జోనల్ స్థాయిలో మొదటి ర్యాంక్
- ఆరు ఉద్యోగాలు సాధించిన అంసాన్‌పల్లికి చెందిన వ్యక్తి

కొల్చారం, మార్చి 11: గ్రూప్-2లో మెదక్ జిల్లా కొల్చారం మండలం అంసాన్‌పల్లికి చెందిన మనోహర్‌రావు రాష్ట్ర స్థాయిలో 434 మార్కులతో మూడో ర్యాంకు, జోనల్ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించారు. రాష్ట్ర స్థాయిలో ఆరు ఉద్యోగాలు సాధించి ఔరా అనిపించారు. సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలం ఉజులంపాడు గ్రామానికి చెందిన పండరీనాథ్‌రావు, కమలమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. అందులో మనోహర్‌రావు మూడోవాడు. టీజీటీలో స్టేట్ మొదటి ర్యాంక్ సాధించి, 2019లో స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం పొందాడు. గ్రూప్ 2లో స్టేట్ మూడో ర్యాంక్ సాధించి, రంగారెడ్డి కలెక్టరేట్‌లో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహించారు. 2025లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన జూనియర్ లెక్చరర్ రాష్ట్రస్థాయిలో ఆర్థిక శాస్త్రంలో నాలుగో ర్యాంకు సాధించారు. దీనికి సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి అపాయింట్‌మెంట్‌ను ఇచ్చారు. గ్రూప్1 పరీక్ష రాయగా అందులో కూడా 430 మార్కులు సాధించారు. హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో ఆరు నెలల పాటు కోచింగ్ తీసుకున్నారు. ఎప్పటికైనా గ్రూప్-1 డిప్యూటీ కలెక్టర్‌గా సాధించడమే అంతిమ లక్ష్యమని ఆయన తెలిపారు. రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు, జోనల్ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించడంలో తన భార్య మనిషా కీలక పాత్ర పోషించిందన్నారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ఉపాధ్యాయులు, స్నేహితులు, గ్రామస్తులు మనోహర్‌రావును అభినందించారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 11: ఇంటర్మీడియట్ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం ప్రథమ సంవత్సరం గణితం పరీక్షకు 7,288 మందికి 7,028 మంది విద్యార్థులు హాజరయ్యారని జిల్లా ఇంటర్ నోడల్ అధికారి మాధవి తెలిపారు. జనరల్‌లో 6,383 మంది, ఒకేషనల్‌లో 645 మంది విద్యార్థులు మొత్తం 96.43. శాతం హాజరైనట్లు పేర్కొన్నారు.

సంతానం కలగడంలేదని వ్యక్తి ఆత్మహత్య

వట్టెపు స్వామి (ఫైల్)

చేగుంట, మార్చి 11: సంతానం కలుగడంలేదని మనస్తాపం చెంది వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నార్సింగికి చెందిన వట్టెపు స్వామి (32) మూడేండ్ల క్రితం వడియారం గ్రామానికి చెందిన మహిళతో వివాహం జరిగింది. వారికి ఇప్పటివరకు సంతానం కలగలేదు. 20 రోజుల క్రితం అతడి భార్య సోదరుడు మృతి చెందాడు. దీంతో ఆమె పుట్టింటికి వెళ్లింది. భార్య లేని సమయంలో జీవితంపై విరక్తి చెంది, వల్లూర్ ఆటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి ఆగమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు నార్సింగి పోలీసులు తెలిపారు.

పరీక్షా సామగ్రి అందజేత

నర్సాపూర్, మార్చి 11: మండలంలోని రెడ్డిపల్లి జడ్పీహెచ్ఎస్‌లో దాత లక్ష్మణ్‌గౌడ్ పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందజేశారు. 500పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.2 వేలు బహుమతిగా ఇస్తానని తెలిపారు.

కౌడిపల్లిలో..

కౌడిపల్లి, మార్చి 11: మండలంలోని రాయిలాపూర్ జడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి విద్యార్థులకు మాజీ ఎంపీటీసీ సారస్వప్నా కిశోర్‌గౌడ్ 40 మంది విద్యార్థులకు పరీక్షప్యాడ్లు, పెన్నులు, స్కేళ్లను మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం జ్యోతి, నాయకులు శంకర్‌గౌడ్, అంజాగౌడ్, రమేశ్‌గౌడ్, మొగులగౌడ్, ప్రతాప్‌గౌడ్ పాల్గొన్నారు.

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్

- జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి దామోదర్‌రెడ్డి

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జిల్లా యువజన క్రీడాల అధికారి దామోదర్‌రెడ్డి

విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఈవో రాధాకిషన్

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 11: దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే ఉన్నదని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి దామోదర్‌రెడ్డి అన్నారు. కేంద్ర యువజన వ్యవహారాల, క్రీడా మంత్రిత్వశాఖ, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జిల్లాస్థాయి యువజన ఉత్సవాలు నిర్వహించారు. దామోదర్‌రెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆనంతరం ఆయన మాట్లాడుతూ యువత తలుచుకుంటే సాధించలేనిది ఏదీ లేదన్నారు. ఈ రోజు మనం అమృత కాలం గురించి, పంచ ప్రమాణాల గురించి మాట్లాడుకుంటున్నాం, ఈ పంచ ప్రమాణాలు మన దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి చాలా ముఖ్యమన్నారు. ప్రధాని మోదీ మార్గదర్శకాలను ప్రతిఒక్కరూ పాటించాలన్నారు. మొదటిది అభివృద్ధి చెందిన దేశమే లక్ష్యం, రెండోది వలసవాద మనస్తత్వాన్ని తొలిగించడం, మూడోది మన మూలాలను గౌరవించడం, నాలుగోది ఐక్యతను పెంపొందించడం, ఐదోది పౌరుల్లో కర్తవ్య భావాన్ని పెంపొందించడం, ఈ సూత్రాలు మన దేశాన్ని ఉన్నత శిఖరాలకు చేరుస్తాయన్నారు. ఇలాంటి యువ ఉత్సవాల ద్వారా యువత తమ ప్రతిభను ప్రదర్శించడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అంతకుముందు డీఈవో రాధాకిషన్ మాట్లాడారు. జిల్లాస్థాయిలో నిర్వహించిన సైన్స్ మేళాలో వివిధ విభాగాల్లో పాల్గొన్న విజేతలకు నగదు ప్రోత్సహకాలు అందజేశారు. ప్రథమ స్థానాల్లో నిలిచిన విజేతలు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని నెహ్రూ యువకేంద్ర జిల్లా అధికారి రంజిత్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, TELJERU SRINIVAS (New Name), Previously Called THELJEERU SREENIVAS (Old Name), R/o. H.No. 10-4-131/5/2, Nasarpura, Siddipet Town & (Urban) Mandal, Siddipet District, T.S. I have Changed My Name from THELJEERU SREENIVAS to TELJERU SRINIVAS for all purposes.

NT-Venkat

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.